
# స్వయంవరం



"శ్రీ వేంకటేశ్వర"

"దీపావళి .....

నా జీవితచరిత్రలో మరపురాని పర్వదినం. అంతులేని ఆనందానికీ, తీయని అనుభూతికీ నవ్య నీరాజనాలిచ్చిన శుభ దీపావళి నాజీవిత శకటానికి సారధియైంది. నాజీవితరథం ఒకపూల బాటలో, రమ్యమైన శాంతి వెలుగులో ప్రయాణం చేసింది." — అని అంటాడు గిరిధర్.

* * *

ఒకొకసారి అనుకోని సంఘటనలు- వూహింపరాని పరిణామాలు మానవ జీవితాల్లో అతిసహజంగా జరుగుతూ వుంటాయి. అవకాశాన్ని సాధ్యమైనంతలో సద్వినియోగం చేయటానికి మానవుడు ప్రయత్నిస్తుంటాడు. అది అతని అదృష్టానికి ప్రతిరూపం. అతని జీవిత పురోగామిలో ఒక మైలురాయి. ఆ సమయంలో యెన్ని శక్తులు ప్రతిఘటించినా పరిస్థితులు విషమించినా అతడు విజయాన్ని చేపట్టగలుగుతాడు. ఆదే అతని అదృష్టలక్ష్మి —.

రాగిణిని యేరికోరి తన హృదయ సామ్రాజ్యానికి పట్టపురాణిగా చేసుకున్నాడు గిరిధర్. పరిస్థితులు కాదన్నా, చుట్టపక్కాలు వద్దన్నా,

ముఖ్యంగా తల్లిదండ్రులు వ్యతిరేకించినా — గిరిధర్ అన్నిటినీ ప్రతిఘటించి రాగిణిని వివాహం చేసుకొన్నాడు. అదృష్టవంతుడిని చెడగొట్ట గలిగిన వారెవరున్నారు.

గిరిధర్ పట్టభద్రుడయ్యాడు. స్వతంత్ర ఆశయాలు గల వ్యక్తి. స్వతంత్ర జీవితం అంటే ఇచ్చగలవాడు. అతనికి ఆస్తి యిల్లు వున్నాయి. తన జీవితాన్ని స్వతంత్రంగా కల్పించి, యితరుల ప్రమేయం లేకుండా, యితరుల దయాదాక్షిణ్యాలకు చిన్నావైన ఆస్తిపాస్తులేవీ లేకుండా గడపాలని వాదిస్తాడు.

తండ్రి సంపాదించిన ఆస్తి తనకు అక్కర లేదనీ, తన తమ్ముడి వున్నత చదువులకు, చెల్లెలి వివాహానికి వెచ్చించమని తండ్రికి చెప్పాడు గిరిధర్. తనకు స్వతంత్ర జీవనంపై ఆపేక్ష కలదనీ, యెలాగైనా తన జీవితాన్ని గడుపుకోదలచానని, తనకై యేలాటి విచారము వుండనక్కరలేదని చెప్పాడు గిరిధర్.

గిరిధర్ మేనమామ విశాఖపట్నంలో యేదో వున్నత పదవుల్లో వున్నాడని, అతని కూతురు లత ను వివాహం చేసుకొమ్మని తల్లిదండ్రులు వత్తిడిచేశారు. గిరిధర్ మొదట్లో నిరాకరించాడు. తన వివాహ విషయంలో స్వతంత్రంగా తనే నిర్ణయించుకోగలనని చెప్పాడు. వైజాగ్‌లో మేనమామకు మంచి పలుకుబడి గలదని, తన వుద్యోగాన్వేషణలో సహాయపడతాడని తండ్రి పట్టుదల పట్టాడు. తండ్రి సూచన గిరిధర్‌కు నచ్చలేదు.

దీపావళి పండుగను సరదాగా తమ యింట్లో గడపిపొమ్మని యెంతో ఆప్యాయంగా, ప్రేమగా ఆహ్వానించాడు గిరిధర్‌ను అతని మేనమామ. మేనమామ ఆహ్వానాన్ని, తండ్రి వత్తిడిని పురస్కరించుకొని కాకపోయినా, కాబోయే తన భార్యామణి లతను చూడాలన్న ఆకాంక్ష కలిగింది గిరిధర్‌కు. లత సుకుమారి అని తల్లి చెప్పింది. లత, తన సంగీతపాండిత్యంతో హృదయాలను



అతిమన్నితంగా ఆకర్షించి రంజింపచేయగలదని యేవేవో వర్ణిస్తూ లతను పొగడుతూ చెల్లాయి చెప్పింది.

ఒకవేళ మేనమామ తనకు వుద్యోగ ప్రయత్నం చేసినా ఫలితముండదని నిష్కర్షగా చెప్పాలని నిర్ణయించుకొన్నాడు గిరిధర్. కేవలం లత అందాన్ని, ఆమె గుణాన్ని కొలచి, ఆమె హృదయాన్ని అర్ధంచేసుకోవాలనిమాత్రమే గిరిధర్ ప్రయాణంలోని ఆంతర్యం.

• • •

విశాఖపట్టణం చేరిన మొదటి రెండుమూడు రోజులు గిరిధర్‌కు యేమీ తోచలేదు. మేనమామ యెప్పుడూ బిజీగావుంటూ అసలు మాట్లాడటానికి టైముండేది కాదు. ఇంట్లో నౌకర్లున్నా పనంతా తాను చేసినట్లు యెప్పుడూ విసుక్కుంటూ వుసూరుమంటూ కూర్చుంటుంది. లత తమ్ముడు చిన్నవాడు. లత యెప్పుడోకాని రాదు. ఇంట్లో యెందరో ఆప్తులు వున్నా మనసిచ్చి కులాసాగా మాట్లాడే ఆత్మీయులు కరువయ్యారు. ఒంటరిగా కూర్చొని లతను గురించి ఆలోచించేవాడు గిరిధర్. లత పోకడలు అతనికి సంతృప్తికరంగా వుండేవి కావు. ఎప్పుడో యేకాంతాన్ని గమనించి గప్‌చిప్‌గా



వచ్చి యెదురుగా కూర్చొని చిలిపికళ్లల్లోనుంచి కొంటెగా చూసేది లత. వాలు జడను అటూ యిటూ సవరించుకొంటూ, కిటికీ ప్రక్కన నిల్చొని — అలా తోటలోకి పూలమొక్కలవైపు ఆకాశంలో తేలియాడుతున్న వెండిమబ్బులవైపు చూస్తూ యేదో తన్మయత్వంలో మైమరచి తీయగా, మంజుల మధురంగా, అతి కోమలంగా, యేదో ఆలాపన చేసేది. కమ్మని ఆరాగాలు గాలిలో తేలుతూ గిరిధర్ కర్ణేంద్రియాలకు సోకి ఒక్క క్షణం అతణ్ణి వివశుణ్ణి చేసేవి. ఆమె మధురగానంలో పరవశత్వం వున్నదికాని ఆమె హృదయానికి ఆకర్షణశక్తి లేదని భావించాడు గిరిధర్.

కొద్ది క్షణాలకు కళ్ళు తెరుస్తాడు గిరిధర్. కాని అక్కడ లత వుండదు. ఎదురుగా టీపాయ్‌లో వెచ్చనికాఫీ పట్టుకొని — పదహారు వసంతాల నిండు జవ్వని చిరుపెదాలపై వెన్నెలను వెద జల్లుతూ నిల్చుంటుంది. ఆమె అందానికి, సోయగానికి ఆశ్చర్య మానసుడై మళ్లీ మూర్ఛ పోయినంతగా హడావుడి పడతాడు గిరిధర్. అతని హృదయం, శరీరం ఒక నూతన అనుభూతిని పొంది స్పందించి పోతాయి. ఆమె కాఫీ కప్పు అందించి, ఒకసారి అతని నేత్రాలలోకి నిశితంగా చూసి మెల్లగా నవ్వి వెళ్తుంది. గిరిధర్ చలనం లేకుండా కూర్చొని ఆకాసేపు యేవో మధుర స్వప్నంలో తేలియాడి, కాఫీ వేడి తగ్గగానే వాస్తవిక జగత్తులోకి పడతాడు.


"భగవాన్! స్వతంత్రేచ్ఛగల నాకు యిది ఒక పరీక్షాసమయం. లత మధురగానంలో యేదో పరవశత్వం వున్నది. రాగిణి సౌందర్యంలో అర్థం కాని యేదో సమ్మోహన శక్తి వుంది. నాహృదయ ద్వంద్వశక్తులను యెదుర్కొంటున్నది. నాఆశ యాలకు భంగం రానివ్వకు —" అని తన మన సులోనే ప్రార్థించాడు గిరిధర్.

రోజులు దొర్లిపోయాయి. దీపావళి సమీ పించింది. ఒకరోజు సాయంత్రం గిరిధర్ తోటలో కుర్చీలో కూర్చున్నాడు. తోటలోని పూలమీదుగా వీస్తున్న సుగంధ సమీరాన్ని ఆహ్వానిస్తూ కూర్చున్నాడు గిరిధర్. లత కాసేపు కూర్చొని వెళ్ళింది. లత ప్రవర్తన కొంతవరకు గిరిధర్‌కు విసుగు కలిగించింది. లత యెప్పుడూ నిలకడగా పదిహేను నిముషాలసేపు మాట్లాడ లేదు. కూర్చోమని బలవంతం చేసినా, ఏవైనా మాటలు కల్పించినా జవాబివ్వకుండా వెళ్తుంది. ఆమె మాట్లాడేది రెండుక్షణాలైనా మనసిచ్చి మాట్లాడదు. ఎంతో అయిష్టంగా, బల వంతంగా మాట్లాడుతున్నట్టుండేది. గర్వం, అహంభావం మిళితమైన స్వరంతో ఎంతో హుందాగా, ముభావంగా మాట్లాడుతుంది. ప్రేమ వున్నట్లు నటిస్తుందే కాని, ఆమె అయిష్టతనూ, ముభావాన్ని గమనిస్తే నిజంగా ప్రేమ వుందో లేదోనని అనుమానం కలుగుతుంది.

ఎంతో చనువుగా, యేవేవో ముచ్చటగ చెప్పాలని వుత్సాహపడతాడు గిరిధర్. కాని ఆమె నిర్లక్ష్య భావ చూపులను, ముభావాన్ని, ముక్త సరి సమాధానాలను చూసి నిస్పృహతో కృంగి పోతాడు గిరిధర్. తన ఆశయాలకు, వుద్దేశ్యా లకు లత సుదూరంలో వుండవలసిన స్త్రీ అని వూహించాడు గిరిధర్. భార్యగా తనకు అను అనుగుణంగా నడిచే లక్షణాలు ఆమెలో లోపించ యని గిరిధర్ గుర్తించాడు.

అనుకోకుండా గిరిధర్ వూహావ్యూహంలో రాగిణి నిల్చుంది. అతని ఆలోచనలన్నీ స్తంభించి

శ్రీరంగ పట్నం దేవళం —జి. వి. సత్యం



పోయాయి. ఏదో ఒక పరిష్కారమార్గం లభించినట్టు హృదయం తేలికంగా నిట్టూర్చింది. మనసులో యేవో సంతోషతరంగాలు చెలరేగాయి. ఆతని మనోఫలకంమీద రాగిణి వూహాచిత్రం రంగులు దిద్దుకుంది.

రాగిణి — లతలను పోల్చుకున్నాడు. ప్రాక్పశ్చిమాలకు యెంత తేడావున్నదో వారిద్దరిలోనూ అలాంటి బేధం కనిపించింది.

పాలపొంగులాంటి యువ్వనంలో అపరంజి బొమ్మలా రాగిణి — మిసమిసలాడే యువ్వనంలో మిడిసిపడుతున్నంత రాగిణి అందంలో సౌకుమార్యం, లాలిత్యం, అన్నిటికీ మించిన ఆత్మీయ సౌందర్యం వున్నాయి. లత అందంలో మార్దవం, గంభీరత్వం, అహంకారహృదయం వున్నాయి. రాగిణి మాటల్లో సరళత్వం, పరవశం, అమాయకత అన్నిటికీ మించిన వినయం ద్యోతకమవుతాయి. లత మాటల్లో కటుత్వం, ముభావత, గర్వం కనిపిస్తాయి. లత వ్యక్తిత్వం కన్నా రాగిణిస్త్రీత్వం యెంతో విలువగలది. గిరిధర్ ఆలోచనా పరంపరకు పర్యవసానం యిదే.

లత అందమైనదే, ఆమె అద్భుతగాయని కావచ్చు. ఆమె గానంలో పరవశత్వం వుండవచ్చు. కాని తన జీవితం సుమధురం కావటానికి ఆమె సంగీతం కారణం కాదు. హృదయాన్ని సమ్మోహించి శాశ్వతంగా ఆకట్టుకోగల సమర్థత అందంలోనే వుంది. సంగీత పరవశత్వం తాత్కాలికం. తనుం కావలసింది ఆమె కళానైపుణ్యం కాదు — ఆమె పరిపూర్ణ హృదయం, అందులోని తీయనిబాధ.

మానవుని నేత్రాలు బహిఃప్రపంచాన్నిచూడగలిగినంతసేపూ ఆచక్షురేంద్రియాలు అందాన్ని అన్వేషించి, అనుభవించి శాశ్వతంగా ఆనందిస్తుంది. తన హృదయాన్ని రంజింపచేసి, తన జీవితం సంతోషదాయకం కావటానికి తన ఆశయాలకు ప్రతిరూపమైన రాగిణి అందం, సహచర్యం అవసరం — గిరిధర్ చివరకు యేదో నిర్ణయానికి వచ్చినట్టు తృప్తి పొందాడు.

• • •

ఆరోజే దీపావళి.

దీపావళి కొరకు యెదురుతెన్నులు చూస్తున్న గిరిధర్‌కు — దీపావళి గడచిన తర్వాత తన యింటికి వెళ్లాలన్న విషయం జ్ఞాపకమొచ్చింది. లత విషయంలో యేదో ఒకటి నిర్ణయించుకోవలసిన అవసరం వచ్చింది.

తెలతెలవారుతూండగానే తలంటు స్నానం చేసింది లత. వదులుగా జడల్లుకొని, అప్పుడే ఆరవిచ్చిన మల్లెలు ముడుచుకుంది. నూతన వస్త్రాలతో మరింత శోభతో గిరిధర్ యెదుట నిల్చింది.

''ఎలా వున్నాను బావా?''— చిలిపిగా ప్రశ్నించింది లత.

''లతా! — నీ అందం మరింత మెరుగులు దిద్దుకుంది. రోజూ యిలాగేవుంటే యెంతో బాగుంటావు.''

ఇతరులచేత పొగిడించుకోవటం లతకు సరదా. అందరూ తను అందకత్తె అనీ, మంచి గాయకురాలు అని మెచ్చుకోవటం — ఆ సమయంలో ఆమె హృదయం అదో రకమైన అనుభూతిని పొందుతుంది.

''ప్చ్. లాభంలేదు. అందమంటే యేమిటో నీకు సరిగా తెలియదు బావా! — నన్ను యేరంభకో, రతీదేవికో పోలుస్తావని ఆశించాను కాని యింత తేలికగా సమాధానమిస్తావని

—డి. వి. యస్. మూర్తి



అనుకోలేదు—". అదో రకమైన యెవ్వాళాన్ని సూచిస్తూ అన్నది లత. గిరిధర్ మెల్లగా నవ్వాడు. లత అహంకారానికి ఒక గొడ్డలి పెట్టులా తోచింది ఆ నవ్వు. తన అందాన్ని, పాండిత్యాన్ని అంత చుల్కనగా చూశాడేమిటని ఆమె ఆశ్చర్యంతోనూ, అంతకన్నా కోపంతోనూ మండిపోయింది.

"నేనంటే అంత చుల్కనగా వున్నదా మిస్టర్ గిరి!—" గిరిధర్ కొంచెం కళవళపడ్డాడు. ఆమె యింత సీరియస్‌గా మారుతుందని బహుశా అతడు వూహించివుండడు. ఆమె తొందరపాటుకు, మనో దౌర్బల్యానికి మనసు నొచ్చుకున్నాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ లతా!— కులకాంతవు. రంభ — వూర్వశిలాంటి వేశ్యలతో యెలా పోల్చను—". గిరిధర్ చమత్కారంగా సమాధానం చెప్పితప్పించుకో చూశాడు. లత కొంచెం సంబాళించుకుంది. ఏదో ఆలోచించినట్లు నటించి మెల్లగా అన్నది. "మరే యితర ప్రబంధ కన్యలతోనో పోల్చవచ్చుగా". గిరిధర్ కొంచెం యిరకాటంలో పడ్డాడు. ఎలాగైనా తనతో పొగిడించుకోవాలని లత పట్టుపట్టినదని పసిగట్టాడు గిరిధర్.

"నీలాగా అందంలోనూ, కళానైపుణ్యంలోనూ పందెం వేయగల ప్రబంధ నాయికవాఙ్మయంలో యెవరూ స్ఫురించలేదు లతా!—".

"తప్పించుకో చూడకు బావా!—యిష్టం లేదంటే అడగనుగా. వాసవదత్త యేమైంది? ఆమె అన్ని రంగాలలోనూ విదుషీమణి కదా!—". లత చురచురా చూసింది. గిరిధర్‌పై ఆమెకు ద్వేషం కోపం కలిగాయి.

ఆమె మనోసంఘర్షణను, వాలకాన్ని గమనించిన గిరిధర్ ఆమెకు కనీసం యీసమాధానంతోనైనా తృప్తికలిగించాలనుకున్నాడు.

"కావచ్చు. వాసవదత్త భువనైకసుందరి.'

"ఆమెను మోహించి వసురాజు పెళ్ళాడలేదా?—".

"పొరబడ్డావు లతా!— వసురాజును వాసవదత్త ప్రేమించింది. ఆతనితో కామించాలన్న కోర్కెతో మోసంచేసి తన అంతఃపురంలో బందీగా చేసింది. సంగీతశిక్షణ అనే నెపంతో శిష్యురాలిగా చేరి తన అందచందాలతో కవ్వించింది. వసురాజు మోసగింపబడ్డాడు కాని మోసం చేయలేదు."

ఆతని సమాధానంవల్ల లత వదనంలో రంగులు మారాయి. కన్నుల్లో కోపారుణరేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. "ఐతే వాసవదత్త తాపత్రయపడిందా. ఆమె సౌందర్యవతి సకల విద్యా సరస్వతి. ఆమె నైపుణ్యాన్ని గమనించి వసురాజు మోహించాడు."

"లతా!— యిదంతా వాసవదత్త పన్నాగం. ఆమె కళావైదుష్యాన్ని మెచ్చుకొన్నాడు. అప్పని సరిగా ఆమెను పెళ్ళాడాడు." ఆతని సమాధానం ఆమెకు తృప్తినివ్వలేదు. పైగా ద్వేషాన్ని రెచ్చగొట్టింది. తనలోని అహంకారం కట్టలుత్రెంచుకొంది. మెల్లగా సంబాళించుకొని అన్నది.

"నన్ను వాసవదత్తకు పోల్చలేదెందుచేత?".

"పోల్చవచ్చు. కాని ఒకప్రశ్న లతా!— లక్ష్య సాధనకోసం వాసవదత్త గొప్పకళ తపస్సు చేసింది. ఆమె అందాన్ని, పాండిత్యాన్ని మేళవించి సర్వస్వాన్ని వసురాజుకు సమర్పించింది. మరి నీవు నీఅందాన్ని, కళావైదుష్యాన్ని యేమి చేయుదలచావు లతా!—".

లత పూర్తిగా అవమానంతో కృంగిపోయింది. ఆవేశం, కోపం కలిగాయి. విద్యాధికురాలన్న అహంభావం, అందకత్తెనన్న గర్వం, గాయని అన్న అహంకారం ఆమెలో అంతవరకు వున్న వుద్రేకాన్ని రెచ్చగొట్టాయి. గిరిధర్ ఆప్రశ్నను యే వుద్దేశ్యంతో వేశాడో ఆమెకు అర్థంకాలేదు. తను కూడా తన సౌందర్యాన్ని, కళను యెవరికైనా అంకితం చేసినపుడే కదా ఆమె వాసవదత్త సమానురాలయ్యేది. కాని ఆమెలో ఆలోచించ తగిన విచక్షణ, వివేకం లేవు. తనకేదో తీవ్రమైన అవమానాన్ని గిరిధర్ సృష్టించాడని ఆమె భావించింది. తనను పొగడకపోగా విమర్శించడం బాగాలేదని అనుకొంది లత. ఈప్రశ్న పుండుపై కారం చల్లినట్లయింది.

"ఏదో చేసుకుంటాను నా యిష్టం. అడగటానికి నీవెవరు? అందమంటె అర్థంచేసుకోలేని మూర్ఖులు—" అంటూ దురుసుగా, కోపంగా మాట్లాడి గబగబా బైటకి వెళ్లిపోయింది లత. లత వెళ్లినవైపు దిగాలుగా చూశాడు గిరిధర్. ఆమె ప్రవర్తన అతనికి చాలా బాధను, వ్యధను కలిగించాయి. లతను అనవసరంగా నొప్పించానేమోనని బాధపడ్డాడు గిరిధర్.

సిగరెట్టు ముట్టించి, సన్నగా పొగవదులుస్తూ జరిగిన సంభాషణను నెమరు వేసుకున్నాడు. ఆమె మాటల్లోని అర్థాన్ని గ్రహించి ఆమె హృదయం యెలాంటిదో పరిశోధన చేయటం ప్రారంభించాడు. ఈదఫా ఆమెకు తనపై ప్రేమలేదని రూఢి అయింది. లత మానసిక ప్రవృత్తి వింతరూపాన్ని పొందటం —. ఆమె హృదయాన్ని అర్థం చేసుకోవటంకన్నా దాదాపు ఆమెకు దూరంగా వుండటమే శ్రేయస్కరంగా కనిపించింది. ఆమె యెంత ముభావంగా వుంటున్నదో, అంతకన్నా ఆపరిస్థితులలోనూ, పరిసరాలలోనూ ముఖ్యంగా లత విషయంలో కఠినంగా, ముభావంగా వుండటం మంచిదని భావించాడు గిరిధర్. అతని మనో ఆకాశంలో రాగిణి ఒక విద్యుల్లతలా తళుక్కున మెరిసింది. ఎందుకో అనుకోకుండా, అకారణంగా రాగిణి అంటే సానుభూతి కలుగుతున్నది. ఆమె అందం, గుణం తన హృదయాన్ని ఆమెకు మరింత దగ్గరగా చేర్చుతున్నాయి. లతనుండి దూరంగా పోయిన తనహృదయం రాగిణికి చేరువగా ఆమె హృదయానికి అతిసన్నిహితంగా చేరుతున్నది.

"బాబుగారూ!— కాఫీ తెచ్చాను." అంటూ రాగిణి ప్రవేశించింది చేతిలో కాఫీకప్పుతో. ఆ పిలుపుకు గిరిధర్ వులిక్కిపడ్డాడు. ఆశ్చర్యంగా గుమ్మం వైపు చూసి, రాగిణిని ఒకసారి పరీక్షించి యెందుకో సన్నగా నవ్వాడు. రాగిణి తలవంచుకొని మెల్లగా వచ్చి కాఫీ కప్పును టేబుల్‌పై పెట్టింది.

వంపులు తిరిగిన ఆమె శరీర సోయగాల్ని రెప్పవాల్చకుండా ఆపాదమస్తకం దీక్షగా చూస్తున్నాడు గిరిధర్. ఆరోజు దీపావళి కనుక రాగిణి కూడా అభ్యంగన స్నానం చేసింది.




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన విరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయితు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు. వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, అకస్మాత్తు ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము. వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేమైనా వున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయుండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (A. W. 13) Jullunder City.**

నల్లని కురులను వదులుగా ముడివేసింది. చెదిరిన ముంగురులు కొన్ని విచ్చలవిడిగా ఆమె పచ్చని నుదుటిమీద కదులుతున్నాయి. శుభ్రంగా వుతికిన సామాన్య దుస్తులు ఆమె శరీరానికి యెంతో శోభనిచ్చాయి. సిగ్గుతో క్రుంగిపోయి సగం మూసుకుపోయిన నేత్రాలతో యేదో అర్థంకాని బాధ, సమ్మోహన శక్తి—వున్నాయి.

రాగిణి సిగ్గుపడి పవిటతో వంటినంతా కప్పుకుంది. ఓరగా గిరిధర్‌వైపు చూసి బరువుగా కనురెప్పలు మూసుకుంది. గిరిధర్ చిన్న మందహాసం చేశాడు.

''రాగిణీ! —''

''ఊఁ—''

''ఇలారా!—''

''స్వామీ!—'' అంటూ యితరులు చూస్తారేమోనని గుమ్మంవైపు చూసి భయంగా. బెదురుగా చూస్తూ తడబడుతున్న అడుగులతో గిరిధర్‌కు సమీపంగా నిల్చుంది.

''ఒక మాట అడగనా రాగిణీ!—''

''రాగిణి సమాధాన సూచనగా మెల్లగా తలూపింది. గిరిధర్ కాఫీత్రాగటం ముగించి, సిగరెట్టు ముట్టించాడు. గిరిధర్ నిశిత దృక్కులను భరించలేక తలవంచుకొని తన పాదాలవైపు చూసుకుంటూ నిల్చుంది.

''రాగిణీ!— నీవొక సౌందర్యరాశివి. ఇలా ప్రోగుచేసిన నీసౌందర్యానికి పర్యవసానం యేమిటి?

రాగిణి ఆశ్చర్యంగా, అమాయకంగా గిరిధర్‌ను చూసింది. బహుశా అంత గాఢమైన ప్రశ్న వస్తుందని ఆమె వూహించివుండదు. కాని అంతలోనే సిగ్గుపడి — తలవంచుకొని తనలో తాను నవ్వుకుంది. హృదయకవాటాలను తెరుచుకొని బయటకువస్తున్న సిగ్గుతెరలను బలవంతంగా ఆపుకొంటూ అరమోడ్చిన కనులతో గిరిధర్ వైపుచూస్తూ, రెండుక్షణాల తర్వాత యెలాగో పెదవులు విప్పి, మృదువుగా యేదో తీయని అనుభూతితో తేలిపోతున్నట్లు మెల్లగా, అమాయకంగా పలికింది.

''భగవంతుడు యిచ్చిన అందాన్ని కాపాడుకుంటాను. నన్ను యేలుకొనే నా స్వామికి పువ్వులలో పెట్టి సమర్పించుకొంటాను స్వామీ!''

ఎంత చక్కని సమాధానం. ఒకే ప్రశ్న. కాని రెండు విభిన్న సమాధానాలు. అహంకారం, ద్వేషం కూడినది ఒకరి జవాబు. అమాయకత, ప్రేమతో కూడిన సమాధానం యింకొకరిది. ఒకరి జవాబులో దురుసుతనం, అప్రస్తుతం, అయిష్టత నిండివున్నాయి. ఇంకొకరి సమాధానంలో 'వాస్తవికత, సిసలైన స్త్రీత్వం మూర్తీభవించినాయి. ఇద్దరూ స్త్రీలే. రూపంలో యిద్దరూ సమానులే. కాని వారి హృదయాలు వేరు. వారి మానసిక ప్రవృత్తులు వేరు. ఒక చిన్న ప్రశ్నకు యిచ్చిన సమాధానంలోనే యిత తారతమ్యం వున్నప్పుడు, వారి హృదయాంతరాళాల మధ్య యెంత అగాధమున్నదో వూహించడం అసాధ్యం.

''సెభాష్ రాగిణీ! నిజమైన స్త్రీహృదయం నీది. నిన్ను పొందగలిగిన వ్యక్తి చాలా అదృష్టవంతుడు సుమా!''.

రాగిణి చిలిపిగా గిరిధర్ కళ్లల్లోకి చూసింది. ఏదో చెప్పాలని ప్రయత్నించి, చివరకు యెలాగో తడబడుతున్న కంఠంతో సన్నగా పలికింది.

''మీలాంటి సహృదయులు నాహృదయాన్ని పాలించే సామ్రాట్టయితే నాభాగ్యం యెలాంటిదని చెప్పగలను స్వామీ!''. గిరిధర్ రాగిణి హృదయాన్ని అర్థంచేసుకోగలిగాడు. గిరిధర్‌కూడా అలాంటి అవకాశంకొరకే నిరీక్షిసున్నాడు.

''రాగిణీ! ఆ అదృష్టవంతుణ్ణి నేనే అయితే?''

రాగిణి హృదయం ఆశ్చర్యం, సంతోషంతో పరవళ్ళు త్రొక్కింది. ఏదో అనిర్వచనీయ అనుభూతితో ఆమె మనసు వూగిపోయింది.

''అంతటి భాగ్యం నాకెలా సాధ్యం స్వామీ!''

''ఎంత అమాయకురాలవు. పుష్పమకరందపు మాధుర్యం తెలియని తుమ్మెద వుంటుందా? నీ అందంలో, నీకన్నుల్లో యేదో సమ్మోహన శక్తి వుంది. ఆ అజ్ఞాతశక్తికి లోనై ప్రేమవలయంలో నాహృదయం యేనాడో చిక్కుకుంది.''

''స్వామీ!—''

''నన్ను అడ్డగించకు. నాహృదయంలో యింతదాకా దాచుకున్న రహస్యాన్ని చెప్పనీ! రాగిణీ! — నిన్ను ప్రేమిస్తున్నాను.''

''స్వామీ! — ఏమిటీ మాటలు? లతమ్మగారికి ద్రోహం చేస్తారా?''

''నేనెవరికీ ద్రోహం చేయలేదు రాగిణీ!— ఆమెను ప్రేమించలేదు. ఆమె ప్రేమను అర్థించలేదు. హృదయంలేని ఆస్త్రీని పెళ్ళాడను— నేను ద్రోహినెలా అయ్యాను?''

''లత మీమీద యెన్నో ఆశలు పెట్టుకుంది. మీరు పెళ్ళాడతారని అదోరకమైన భావన, ధైర్యం వున్నాయి.''

''నేను బాధ్యుణ్ణికాదు రాగిణీ. అహంకారిని, ఉద్రేకిని నేను యిల్లాలిగా స్వీకరించలేను. నిర్మల ప్రేమతో ఆరాధించి నాహృదయాన్ని రంజింపచేయుగల నా రాగిణికి ద్రోహంచేయగలనా? నాపై ఆశలు, నాపై ప్రేమలేదని నీవు చెప్పగలవా రాగిణీ!—''

రాగిణి హతాశువైంది. ఆమె కనుకొలకులు చెమ్మగిల్లాయి. మెల్లగా గిరిధర్ పాదాలపై వ్రాలింది. ''ఇది యేమి పరీక్ష స్వామీ! నాహృదయాన్ని యెలా మోసగించగలను?''

''పిచ్చిదానా!— ఇది స్వయంవర పరీక్ష. లతకు నాపై ప్రేమలేదు. నాపై ప్రేమగల వారిని నేను యెన్నుకొన్నాను.''

రాగిణి అలాగే అతని పాదాలను తాకుతూ కూర్చుంది.

''లే! రాగిణీ—పర్వదినమైన వుషోదయాన మనమిలా కలుసుకోటం దైవికంగా జరిగింది. మనలో నూతనోత్సాహాన్ని, నవరాగరంజితమైన జ్యోతిని ప్రసాదించింది. దీపావళి చూపించిన వెలుగుబాటలో మన జీవితాలను సవ్యంగా నడుపుదాం పద—''.

రాగిణిని గాఢంగా కవుగలించుకున్నాడు గిరిధర్.

''నేను ధన్యురాలిని స్వామీ!— మనల్నిలా కలిపిన దీపావళికి నా నమస్సులు''— అంటూ రాగిణి అతని బాహువల్లరిలో ఒదిగిపోయింది.

• • •

''ఆతర్వాత యెన్ని పరిస్థితులు, అవాంతరాలు అడ్డుతగిలినా రాగిణిని నాదానిగా చేసుకున్నాను. మావివాహం తర్వాత జీవిత పురోగానంలో రెండు దీపావళులు మైలురాళ్లలా గడచిపోయాయి. మూడవమైలు రాయిని కలుసుకున్నాం.

ఆనాటి దీపావళి — వుషోదయం మాజీవితంలో శుభోదయాన్ని కలుగజేసింది.

ఈనాటి దీపావళి వుషోదయం మాదంపతులకు పుత్రోదయాన్ని కలుగజేసింది. అంటే రాగిణి తల్లిగానూ, నేను తండ్రిగానూ మారాము.

అందుకే దీపావళి — నాజీవిత చరిత్రలో అపూర్వపర్వదినం. అంతులేని ఆనందానికి, తీయని అనుభూతికి నవ్యనీరాజనాలిచ్చిన శుభ దీపావళి. నాజీవిత శకటానికి సారథియైంది. నాజీవితరథం ఒక పూలబాటలో, రమ్యమైన కాంతి వెలుగులో ప్రయాణం చేసింది., చేస్తున్నది. భవిష్యత్కాలంలో కూడా ప్రతి దీపావళి మాజీవితంలో ఒక ముఖ్య ఘట్టానికి ప్రాముఖ్యత వహిస్తుందనీ, ఎప్పటికప్పుడు నూతన జ్యోతిని ప్రసాదిస్తుందని ఆశిస్తాను'' అని అంటాడు గిరిధర్ ఆనంద భాష్పాలు రాలుస్తూ—

